# లింగ ప్రతిష్ట

ప్రపంచమే లేని సమయములో ఉన్నది ఒక పరమాత్మయే. ఆ స్థితి నుండి కొంత కాలమునకు ప్రపంచము ఉత్పత్తియైనది. ప్రపంచ ఉత్పత్తికి ఒకే ఒక శక్తి కారణము, అది పరమాత్మయే. పరమాత్మ నుండి ఉద్భవించినదే ప్రపంచము. ప్రపంచమనగా! ప్ర అంటే పుట్టుట, పంచము అనగా ఐదు. ప్రపంచమనగా! పుట్టిన 1. ఆకాశము, 2. గాలి, 3. అగ్ని, 4. నీరు, 5. భూమి అని అర్థము. ఈ ఐదు భాగములను కలిపి ప్రకృతి అనుట కూడ జరిగినది. ప్రకృతి అనిన ప్రపంచమనిన ఒకటేనని తెలియవలెను. ప్రకృతి ఐదు భాగముల నుండి ఎన్నియో జీవరాసులు ఉద్భవించినవి. జీవరాసులు జీవించి మరణించుటకు తగిన యంత్రాంగమంతయు ప్రకృతి నుంచియే ఏర్పరచబడినది. ప్రకృతి జనితమైనదే శరీరము, ప్రకృతి జనితమైనవే గుణములు. సమస్త జీవరాసుల శరీరములు ప్రకృతిలోనే పుట్టి, ప్రకృతిలోనే పెరిగి ప్రకృతిలోనే లయించుచున్నవి. తిరిగి ప్రకృతియందే పుట్టుచున్నవి.

జీవరాసుల పుట్టించుటకు ప్రకృతికి స్వయం శక్తి ఉన్నదా? అని యోచించినపుడు ప్రకృతికి ఆ శక్తి లేదని తెలియుచున్నది. ప్రకృతి వలన జరిగే పనులకన్నిటికి ఒక శక్తి అవసరము. అదియే పరమాత్మ శక్తి. భగవద్గీత రాజవిద్యా రాజగుహ్య యోగమను అధ్యాయము

*10 వ శ్లో: మయాధ్యక్షేణ ప్రకృతి స్సూయతే సచరాచరమ్,*
*హేతునా నేన కౌంతేయ! జగ ద్విపరివర్తతే.*

"ప్రకృతి నా ఆధారము చేత జీవరాసులను పుట్టునట్లు చనిపోవునట్లు చేయుచున్నది." అందువలన నేను ఇరుసుగ ఉన్నాను. నన్ను ఆధారము చేసుకొని ప్రపంచము చక్రమువలె తిరుగుచున్నదని పరమాత్మ అన్నాడు.

బ్రహ్మవిద్య ప్రారంభములో మనమెవరము? మన పుట్టుక ఏమి? అట్లే మరణమేమి? చావు పుట్టుకలకు కారణము ఎవరు? ఏ శక్తి వలన ఇది అంతయు జరుగుచున్నదని తెలియవలయును. అట్లు వివరించుకొనిన ప్రకృతివలన మన శరీరము తయారగుచున్నదని, తయారయిన శరీరములో ఆత్మ చైతన్య స్వరూపమై కదిలిక నిచ్చుచున్నదని, అందువలన శరీరమును తయారు చేసి ఒక ఆకృతినిచ్చునది ప్రకృతియని తెలియుచున్నది. కావున దానిని సర్వజీవులకు తల్లిగ చెప్పుచున్నాము. జడములైన శరీరములకు కదలికశక్తి నిచ్చి కదలించుచు జీవస్వరూపము ఏర్పరచుచున్నది పరమాత్మ శక్తి కావున పరమాత్మను సర్వ జీవులకు తండ్రిగ చెప్పుచున్నాము. సర్వ ప్రపంచములోని జీవరాసులకు తల్లి ప్రకృతి, తండ్రి పరమాత్మ అని బ్రహ్మవిద్యలో ప్రధమాంశముగ తెలియవలయును. మూలమైన పరమాత్మ శక్తి నుండి వెలువడి ప్రకృతి ఆధారముతో శరీరముల ధరించి పుట్టి గిట్టుచున్నామను విషయము ప్రప్రథమముగ అందరికి తెలియవలసిన జ్ఞానము.

ఈ విషయము తెలియజేయు నిమిత్తము 'తల్లిదండ్రుల మీద దయ లేని పుత్రుడు పుట్టనేమి గిట్టనేమి పుట్టలోని చెదలు పుట్టవా! గిట్టవా!' అని వేమనయోగి అన్నాడు. అనగా పరమాత్మ ప్రకృతిని గురించి తెలియనివాడు పుట్టినప్పటికి పుట్టని వానితో సమానమే. ఎవరికి తెలియకనే పుట్టలోని చెదలు పుట్టి గిట్టినట్లు మన జన్మ కూడ వృథాయే అని ఆయన భావన. అందువలన ప్రతి జీవుడు అసలయిన తల్లిదండ్రులెవరో తెలియవలయును. సర్వ జీవులకు నిజమైన తల్లిదండ్రులను తెలుపుచు భగవద్గీత గుణత్రయ విభాగ యోగమను అధ్యాయములో

*3వ శ్లో:*		*మమ యోని ర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్*
*సమ్భవ సర్వభూతానాం తతో భవతి భారతా!*

*4వ శ్లో:*		*సర్వయోనిషు కౌంతేయ! మూర్తయః సమ్భవన్తియాః*
*తాసాం బ్రహ్మ మహద్యోని రహం బీజ ప్రదః పితా.*

**భావము :–** "ప్రకృతి అంతయు నాకు స్త్రీగ ఉన్నది. దానికి నేను బీజ దాతగ ఉన్నాను. అందువలన సమస్త జీవరాసులు మాకు పుట్టు చున్నవి. ఏ గర్భము నుండి ఏ ఆకారముతో పుట్టు జీవరాసియైన అనగ సమస్త జీవరాసులకు మాత మూల ప్రకృతి, బీజదాతనైన నేను తండ్రిననుచు తెలియవలయును." పూర్వకాలములో శాస్త్రవచన ప్రకారము తల్లి తండ్రియైన ప్రకృతి పరమాత్మలను తెలిసిన వారు ఈ విషయము మాసి పోకుండ అందరు గ్రహించునటుల చేసిన విధానమే లింగ ప్రతిష్ఠ. పరమాత్మకు ఆకారము లేదు కావున ముక్కు ముఖము లేని ఒక రాయినియుంచి దానిని దేవుడనడము మొదట జరిగినది. పరమాత్మ పురుషుడనునట్లుగ పురషాంగకారమైన లింగమును ప్రతిష్ఠించారు. ప్రకృతిని స్త్రీగా గుర్తించునట్లు స్త్రీ యోని ఆకారముగ పాణిమట్టమును మలచి ఉంచారు. స్త్రీ అంగాకారమైన పాణిమట్టములో పురుష అంగాకారమైన లింగమును ప్రతిష్ఠించి ప్రకృతి పురుషులు కలసి ఉన్నారను అర్థమొచ్చునట్లు చేశారు. పాణిమట్టము మధ్యలో లింగమునుంచడము ప్రకృతికి పరమాత్మ ఇరుసుగ ఉన్నదని తెలియుచున్నది. పాణిమట్టము పైన లింగము నుంచడము వలన ప్రకృతినదిష్టించి పరమాత్మ ఉన్నాడను భావన కూడ తెలియుచున్నది. లింగము కొంత పాణిమట్టము లోపల, కొంత పాణిమట్టము బయట కనిపించడము పరమాత్మ ప్రకృతిలోపల ప్రకృతి బయట ఉన్నాడను విషయము తెలియబడుచున్నది. ఈ విధముగ పెద్దలు అర్థమొచ్చునట్లు ఉంచడము శృంగారము కొరకు గాదు. ప్రకృతి పురుషుల రహస్యమిది అని తెలియజేయు నిమిత్తమే గాని వేరుగాదు.

ప్రకృతి పురుషులకలయికయే జగత్తుకు మూల కారణమని తెలుపునిమిత్తమే ఇందులోని భావనగాని వేరుగాదు. సమస్త జీవరాసులకు మాత ప్రకృతి తండ్రి పరమాత్మని తెలుపు నిమిత్తమే ఈ లింగ ప్రతిష్ఠ జరిగినది. సమస్త జీవరాసులు పరమాత్మ చైతన్యము చేత ప్రకృతి నుండి ఒక ఆకారముతో పుట్టుచున్నవని తెలుసుకొనునటుల లింగము మీద ఒక పాత్రనుంచి దానిలో నీరు పోసి ఒక్కొక్క చుక్క లింగము మీద పడునట్లు చేశారు. లింగము మీద పడిన నీటి బిందువు లింగము నుండి జారి ప్రకృతిగ పోల్చిన పాణిమట్టమునుచేరి అక్కడ నుండి ఒక మార్గము ద్వారా బయటపడుచున్నది. ఈ విధముగ ప్రతి నీటి బిందువు జారిపోవుచున్నది. ప్రతి జీవరాసి ప్రకృతి పురుషుల వలననే జన్మించుచున్నదనుటకు తార్కాణముగ లింగ ప్రతిష్ఠ మీద ధారా పాత్రనుంచారు. నీటి బిందువులను జీవులుగ పోల్చి పరమాత్మ ప్రకృతివలననే ఉద్భవించుచున్నవనునటుల నీటి బిందువును లింగము నుండి జారి పాణిమట్టము నుండి బయటికి పోవునట్లు చేశారు. క్రింది నీటినే అనగ చెరువు నుండిగాని కొలను నుండిగాని బావి నుండిగాని తెచ్చి ధారాపాత్రలో పోసి ఉంచుచు ఎల్లవేళలు ఎడతెరిపి లేకుండ లింగము మీద నీటి బిందువులు పడునట్లు చేయడము వలన ఎడతెరిపి లేకుండ జీవులు చస్తు పుట్టుచున్నవని తెలియుచున్నది. లింగము నుండి నీరు పాణిమట్టము మీదుగ పోవడమే సృష్టి అంతరార్థముగ పెద్దలు నిర్మించారు.

ఇపుడు చెప్పబోవునది ముఖ్యాంశము, సర్వజీవరాసుల అంతరార్థము ఇందులో ఇమిడి ఉన్నది. పరమాత్మ స్వరూపము మూడు భాగములుగ విభజింపబడి ప్రకృతియంతటా వ్యాపించి ఉన్నది. అట్లు వ్యాపించిన విధానము ఈ విధముగ ఉన్నదని చూపడమే ఇందులోని సారాంశము. పరమాత్మ ప్రకృతికంటే అతీతునిగ ఉండి ముగ్గురు పురుషులుగ వ్యాపించి ఉన్నాడనుటకు తార్కాణముగ ఈశ్వరలింగము మీద విభూతి రేఖలు మూడుగ చూపించడము జరిగినది. భగవద్గీత యందు పురుశోత్తమప్రాప్తి యోగము అను అధ్యాయములో చెప్పబడిన క్షర అక్షర పురుశోత్తములను ముగ్గురు పురుషులుగ ఒక్క పురుషుడే విభజింపబడి ఉన్నాడని అర్థమువచ్చునట్లు లింగము మీద మూడు తెల్లని సారలుగ (రేఖలు) చూపడము జరిగినది. అందులో క్రింద ఉన్న రేఖ జీవాత్మ అని మద్యన గల రేఖ సర్వజీవులందు కలిసి ఉన్న ఆత్మ అని, పైన ఉన్న రేఖ పరమాత్మ అని అర్థమొచ్చునటుల తీర్చిదిద్దారు. లింగము మీద మూడు రేఖలు ఉంచడమేకాక మధ్యన ఉన్న రేఖకు మాత్రము చందనముతోనో కుంకుమతోనో బొట్టు పెట్టడము వలన దానికి ప్రత్యేకత ఏర్పడినది. అట్లు గుర్తించుటకు కారణమేమనగా!

ఒక్కొక్క శరీరములో ఒక్కొక్కటిగ వేరువేరుగ ఉన్నవి "జీవాత్మలు". అన్ని శరీరములలో ఒకే అంశగ ఉంటూ ఒక్కొక్క శరీరములో విడివిడిగ ఉన్నది "ఆత్మ". శరీరములలోను బయట అంతట ఒకటిగ వ్యాపించి ఉన్నది "పరమాత్మ". జీవాత్మ ఆత్మలు సజీవమైన శరీరమందు మాత్రమే ఉండును. పరమాత్మ సజీవ, నిర్జీవ శరీరములందు కూడ కలదు. జీవాత్మ ఉన్న చోటునే ఆత్మ కూడ ఉండును. అందువలన కూటస్థుడను పేరు కూడ ఆత్మకు కలదు భగవద్గీత పురుశోత్తమ ప్రాప్తి యోగములో

*16వ శ్లో:* *ద్వావిమౌ పురుషౌ లోకేక్షరాశ్చక్షర ఏవచ*
*క్షర స్సర్వాని భూతాని కూటస్థో క్షర ఉచ్యతే.*

"లోకములో ఇద్దరు పురుషులున్నారు, వారే క్షరాక్షరులు. క్షరుడు సర్వజీవ శరీరములందు కలడు. అక్షరుడు క్షరుడెక్కడ గలడో అక్కడ వానితో కూడుకొని ఉన్నాడు."

ఈ ఇద్దరి పురుషులకంటే వేరుగ ఉత్తమమైనది ఒకటున్నదని 17వ శ్లోకములో తెలియజెప్పారు, దానినే పరమాత్మ అనుట కూడ జరుగుచున్నది. ఆత్మకంటే పరముగ (వేరుగ) ఉన్నది కావున మూడవదానిని పరమాత్మ అనడములో అర్థము గలదు. ఈ విధముగ ఉన్న ముగ్గురి పురుషులను గూర్చి తెలియజెప్పడమే లింగము మీద మూడు రేఖల గుర్తింపు. జీవాత్మ పరమాత్మను చేరినపుడు జన్మలు లేకుండా పోయి జీవభావము నశించి దైవభావమేర్పడును. అనగా జీవాత్మ అణువణువున వ్యాపించి ఉన్న పరమాత్మలో చేరి తాను కూడ శూన్యుడైపోవును. ఆ విధముగ జీవాత్మ పరమాత్మను చేరవలయునంటే రెండవదైన ఆత్మను తెలుసుకొని తీరవలయును. ఆత్మను తెలుసుకొని ఆత్మజ్ఞానశక్తి చేత జన్మలకు కారణమయిన కర్మలనన్నింటిని నిర్మూలన చేసుకొన్న తర్వాతనే జీవాత్మ పరమాత్మను చేరగలడు. జీవాత్మ శరీరముతో ఉన్నపుడు ఆత్మను తెలుసుకొనిన, శరీరము వదలిన తర్వాత పరమాత్మను సందర్శించగలడు. అందువలన శరీరముతో ఎవరు కూడ పరమాత్మను తెలియలేరు. పరమాత్మ శరీరము లేనివారికే తెలియును. ఏ జీవుడు కాని జీవితములో ఆత్మనే తెలుసుకొని ధ్యానించవలయును. పరమాత్మను ధ్యానించలేదు, పూజించ లేదు. అందువలన లింగము మీద మూడు రేఖలుగ గుర్తించిన వాటిలో మధ్యనున్న రేఖకు చందన, కుంకుమ గుర్తింపు ఇచ్చారు.



**ఈశ్వర లింగము**

ఆత్మలు స్వచ్ఛమైనవని గుర్తించుటకు స్వచ్ఛమైన తెల్లని రంగులో రేఖలు గుర్తించారు. ముఖ్యముగా పాణిమట్టమును వదలి లింగమునే పూజింతుము. కనుక ప్రకృతికంటే పురుషుడే ముఖ్యమని తెలియబడుచున్నది. పైన చెప్పబడిన మూడు రేఖల గురించి చాలామందికి వేరు అభిప్రాయము గలదు. విమర్శకు నిలబడని కట్టు కథలు జ్ఞానము కాదు. విమర్శకు నిలబడు విషయములే నిజమైన జ్ఞానమని తెలియవలయును.

ధనేషణ, ధారేషణ, పుత్రేషణ అను ఈషణత్రయములుగ అభివర్ణించి లింగము మీది మూడు రేఖలను చెప్పుచున్నారు. ఇది అసత్యమని చాలామందికి తెలియదు. సత్యాసత్యములు విమర్శ వలననే తెలియును. కనుక ఇపుడు విమర్శ చేయక తప్పదు. జీవునకు ఉన్న గుణములలో 1. కామ (ఆశ), 2. క్రోధ, 3, లోభ, 4. మోహ, 5. మధ, 6. మాత్సర్యమనునవి ముఖ్యమైనవి. వాటిలో మొదటిది ఆశ (కామము) ఆశలు అనగ ఎన్నో రకములుగనున్నవి. తిండి మీద ఆశ, గుడ్డల మీద ఆశ, భూముల మీద ఆశ, ఇట్లు ఎన్నో రకములుండవచ్చును. ధనము మీద ఆశ, భార్య మీద ఆశ, పుత్రుల మీద ఆశను శంఖరుడు కాల్చి బూడిద చేసి ఆ బూడిదను తన నుదుట దిద్దుకున్నాడని, ఆ మూడు ఆశలను జయించినానను గుర్తుకు వాటిని నొసటి మీద ధరించి చూపి మీరు ఈ మాదిరి ఆశలు జయించండని ఆయన విభూతి రేఖలను ధరించాడని చాలామంది అనుచున్నారు. అట్లయిన శంఖరునకు ధన, భార్య, పుత్రుల మీద ఆశ మాత్రమే లేదని మిగత

ఆశలన్ని ఉన్నవని తెలియుచున్నది. జ్ఞానమార్గములో ఆశలన్ని జయించండనడము సమంజసమే. కాని మూడు ఆశలను మాత్రమే జయించండి అనడము ఏమి సమంజసము? శంఖరునకు ధనము మీద ఆశ లేదు కాని భూమి బంగారు మీద ఆశ ఉండవచ్చును. అట్లే మిగత ఆశలన్ని ఉండవచ్చును. అటువంటపుడు ఆయన కామదహనుడెట్లగును? ఈ ప్రశ్నలకు సరైన సమాధానము లేదు. కనుక ధనేషణ, ధారేషణ, పుత్రేషణ అను ఈషణత్రయ భావము విభూతి రేఖలకు సరిపడదు. అసలుకు, లింగమునకు శంఖరునకు ఏమాత్రము సంబంధము లేదు ఎట్లనగా!

పూర్వము పరమాత్మను తెలియజేయు నిమిత్తము లింగ ప్రతిష్ట చేయగ నేడు దానిని వక్రీభవించి లింగమును శంకరునిగా పోల్చడము జరుగుచున్నది. ఈశ్వరునికి శంకరునికి ఎంతో తేడా ఉన్నప్పటికయిన ఈ కాలములో ఈశ్వరుడే శంఖరుడైనాడు, శంఖరుడే ఈశ్వరుడైనాడు. కోటీశ్వరుడు అనగా కోటికి అధిపతి. లక్షాదీశ్వరుడనగా లక్షకధిపతి. అట్లే బోగేశ్వరుడనగ బోగమునకు అధిపతి. యోగీశ్వరుడనగ యోగమునకధిపతి అని అర్థమగుచున్నది. ఈశ్వరుడు అన్న పదమునకు అధిపతి అని విశదముగ తెలియుచున్నది. ప్రపంచమునకే అధిపతియైన పరమాత్మను ఒక్కడినే ఈశ్వరుడని బ్రహ్మావిద్యలో అనుట జరుగుచున్నది. ప్రకృతికే అధిపతియైన పరమాత్మ భావముతో లింగమును ఉంచగా దానిని మెడలో పాము ధరించిన శంకరునిగ పోల్చడము అర్థము లేనిపని.

ఆదికాలములో ఉన్న జ్ఞానము ప్రస్తుత కాలములో తలక్రిందులైనది. దానికి కారణము మతములో చీలికలు, స్వార్థము. ప్రాచీనకాలములో ఉన్నది ఒకే ఒక మతము. కాలము జరుగుకొద్ది ఒక్క మతము నుండియే ఎన్నో మతములు చీలినవి. మొదట మతముగ ఉన్నది ఇందూ మతము. ఆ మతము ఈనాడు హిందూమతమైనది. మొదటి ఇందూమతములో ఉన్న కొందరు ఒక తెగగ మారిపోయి మేము గొప్ప వారమనిపించుకోవలయునను ఉద్దేశముతో మాది శైవమతమని శైవమత దేవుడు శివుడని, ఆ శివుడే ఈ లింగమని, ఆ లింగమును పూజించు వారందరు మా శైవులేనని ఈశ్వర లింగమును పూజించువారందరు శైవులను అభిప్రాయము కలుగజేసి అందులకు కావలసిన మార్పులు, చేర్పులు, కూర్పులు ఎన్నెన్నో చేశారు. అట్లు చేయడములో ఈశ్వర లింగము ముందర నందీశ్వరుడు, ప్రక్కన పార్వతినుంచడము జరిగినది.

శివునికి భార్య పార్వతి, వాహనము నంది. కావున వీరిద్దరిని ఈశ్వరలింగముతో సంబంధపరచిన ఈశ్వరలింగము శివుని క్రిందికి లెక్క కట్టవచ్చునని పార్వతిని ప్రక్కన, నందిని ముందర ఉంచారు. లింగ ప్రతిష్టముందే ఆదిలో జరిగి ఉన్నది. కావున పార్వతిని ప్రత్యేకించి ప్రక్కన పెట్టారు. కాని ఆ లింగ పీఠములో సంబంధపరచ లేక పోయారు. అందువలన ఎక్కడైనగాని పార్వతి ప్రత్యేకించి ప్రక్కన ఉంటుంది. మిగత దేవతలకు మాత్రము భర్త పీఠములోనే భార్య కూడ ఉండడము గమనించవచ్చును. అట్లే వారివారి వాహనములు కూడ ఆ పీఠములలోనే పొందుపరచడము జరిగి ఉంటుంది. కాని మొదటనే తయారయిన ఈశ్వరలింగమును ఏమి చేయలేక పార్వతిని, నందిని వేరువేరుగ పెట్టడము జరిగినది. అట్లు చేయడమేకాక దానిని సమర్థించి చెప్పుటకు పురాణములు కూడ తయారు చేయబడినవి. నందిని లింగమునకు ఎదురుగ కొంత దూరములో పెట్టి దానికి కూడ ఒక కట్టుకథ చెప్పడమైనది. ఆకారములేని దేవునిగ గుర్తించుటకు ముక్కు ముఖములేని రాయిని శంకరునిగ వర్ణించు నిమిత్తము కూడ ఒక కథ అల్లి శాపము చేత శంకరుడు గుండుగ మారిపోయాడని వర్ణించడము జరిగినది.

ఏది ఏమయిన తెలివైనవారు లింగమునకు పార్వతికి, నందికి సంబంధములేదని సులభముగ గ్రహించగలరని భావించుచున్నాము. ఈ కాలమున కూడ అక్కడక్కడ ఈశ్వరప్రతిష్ట దేవాలయములలో పార్వతి లేదు. ఒక నంది మాత్రము లింగమునకెదురుగ ఉండడము గ్రహించ వచ్చును. ప్రత్యేకించి పార్వతి మందిరము తయారు చేయుటకు ఎక్కువ ఖర్చు కావున పార్వతిని వదలి వేసి మందిరముతో అవసరము లేకుండ ఉండు నందిని మాత్రము ఉంచిన ఈశ్వర దేవాలయములు అక్కడక్కడ కనిపించగలవు.

జ్ఞాన దీపము ఆరిపోదు, కావున నేడు బహిర్గతమవుచున్నదని మేము భావిస్తున్నాము. పూర్వము పెద్దలు ఎంతో కృషి చేసి జ్ఞానమును మూర్తీభవింపచేసి నిర్మించిన ఈశ్వర దేవాలయము శంకరుని దేవాలయముగ మారుట మన దురదృష్టకరము. అయిన పెద్దల కృషి ఊరక పోదు. కావున ఇప్పటికి శివుని గుడి అనడమేకాక ఈశ్వర దేవాలయమనుట కూడ ఉన్నది. శివుడు, ఈశ్వరుడు వేరువేరని ముఖ్యముగ తెలియవలయును. ఈశ్వరుడనగా అధిపతి అని ముందుగానే చెప్పి ఉన్నాము. శివుడనగా త్రిమూర్తులలో ఒకడను భావము గలదు. త్రిమూర్తులకు కూడ అధిపతి ఒక్కడే! ఆ ఒక్కడే ఈశ్వరుడు (పరమాత్మ).